


## గొంతెత్తుదాం.. పోరాడుదాం

- బడ్జెట్ కేటాయింపుల్లో నిర్లక్ష్యంపై నేడు బీఆర్ఎస్ నిరసన
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వివక్షను వ్యతిరేకించాలి
- హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్

హనుమకొండ చౌరస్తా, జూలై 25 : కేంద్ర, రాష్ట్ర బడ్జెట్లలో నిధుల కేటాయింపులో ఓరుగల్లుపై నిర్లక్ష్యం, వివక్షకు వ్యతిరేకంగా కాజీపేట చౌరస్తాలో శుక్రవారం మధ్యాహ్నం 3.30 గంటలకు నిరసన కార్యక్రమం చేపట్టనున్నట్లు బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్ తెలిపారు. రాష్ట్ర విభజన చట్టంలోని హామీలను విస్మరించడం, ఉమ్మడి జిల్లా అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించకపోవడంపై ఓరుగల్లు వేదికగా పోరుగళం వినిపించనున్నట్లు చెప్పారు. ఓరుగల్లుకు జరుగుతున్న అన్యాయంపై 'గొంతెత్తుదాం.. నినదిద్దాం.. పోరాడుదాం.. మన హక్కులను సాధిద్దాం' నినాదంతో నిరసన తెలుపనున్నట్లు పేర్కొన్నారు. ఓరుగల్లు అభివృద్ధిని కాంక్షించే ప్రజాస్వామికవాదులు, ఉద్యమకారులు, విద్యార్థులు, బీఆర్ఎస్ శ్రేణులు, ప్రజలు పార్టీలకతీతంగా తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

### విద్యకు ప్రాధాన్యత లేని బడ్జెట్



జనగామ, జూలై 25 (నమస్తే తెలంగాణ) : రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి కేటాయింపులు చూస్తే విద్యాభివృద్ధిపై ప్రభుత్వానికి మాటలే తప్ప చేతలు కావన్నట్లు స్పష్టం అవుతున్నది. గతేడాది రాష్ట్ర బడ్జెట్‌లో 6.56 శాతం నిధులు కేటాయిస్తే, ఇప్పుడు 7.31శాతం కేటాయించారు. విశ్వవిద్యాలయాలకు రూ.500 కోట్లు మాత్రమే కేటాయించడం విద్యపై కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎంత చిత్తశుద్ధి ఎంతో తేటతెల్లమవుతున్నది. విద్యారంగంలో వినూత్న మార్పులు చేస్తామని, ఇంటర్నేషనల్, ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నెలకొల్పుతామని గొప్పలు చెప్పి అందుకు తగినట్లు బడ్జెట్ కేటాయింపులు చేయలేదు. కాంగ్రెస్ పార్టీ తన మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు బడ్జెట్లో 15 శాతం కేటాయించినా కనీసం రూ.44.6 వేల కోట్ల నిధులు వచ్చేవి. అరకొర నిధులతో నాణ్యమైన విద్య అందని ద్రాక్ష కానున్నది.

**– డీ శ్రీనివాస్, టీపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు**

### ప్రాధాన్యతను గుర్తించి నిధులు ఖర్చు చేయాలి



కృష్ణకాలనీ : రాష్ట్రంలోని సంక్షేమ రంగాల ప్రాధాన్యతను గుర్తించి బడ్జెట్‌లో కేటాయించిన నిధులను ప్రభుత్వం ఖర్చు చేయాలి. రైతు రుణమాఫీ, రైతు భరోసా, రైతు బీమాతో పాటు వ్యవసాయ పరిశోధనలకు రు.72,659 కోట్లు కేటాయించడాన్ని స్వాగతిస్తున్నాం. విద్య, వైద్యానికి మాత్రం గతంలాగే కేటాయింపులున్నాయి. వైద్య రంగానికి కేటాయించిన నిధులు బస్తీ, గ్రామ, ప్రభుత్వ దవాఖానలకు సరిపోవు. ఇండ్ల నిర్మాణానికి రూ.8,424 కోట్లు మాత్రమే కేటాయించారు. ప్రభుత్వ భూములను అర్హత గల పేదలకు పంపిణీ చేసి ఇండ్ల నిర్మాణానికి కనీసం రూ.10 లక్షల చొప్పున ఇవ్వాలి. అందుకనుగుణంగా బడ్జెట్‌ను పెంచాలి. నిరుద్యోగ సమస్య పరిష్కారానికి జాబ్ క్యాలెండర్‌ను వెంటనే విడుదల చేయాలి. మహిళలకు అందించే రూ. లక్ష ఆర్థిక సాయాన్ని వడ్డీ లేకుండా రూ.2లక్షలకు పెంచాలి.

**– బందు సాయిలు, సీపీఎం జిల్లా కార్యదర్శి, జయశంకర్ భూపాలపల్లి**

### బీసీ సబ్‌ప్లాన్ మరిచారు..




పోచమ్మమైదాన్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో బీసీలకు తీరని అన్యాయం జరిగింది. బీసీల సంక్షేమం, అభివృద్ధికి రూ. 9,200 కోట్లు మాత్రమే కేటాయించి నిరాశకు గురిచేసింది. అసెంబ్లీ ఎన్నికలకు ముందు ప్రకటించిన బీసీ డిక్లరేషన్‌లో బీసీ సబ్ ప్లాన్ ఏర్పాటు చేసి రూ. 25 వేల కోట్లు కేటాయిస్తామని ఇచ్చిన హామీని పాలకులు విస్మరించారు. చేనేత, గీత, మత్స్య, విశ్వకర్మ, నాయీ బ్రాహ్మణ, కుమ్మరి, రజక, గొర్రెల పెంపకందారులు, చేతివృత్తుల వారికి బడ్జెట్ కేటాయింపులో కూడా ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది. సామాజిక పింఛన్ రూ.4వేలు, దివ్యాంగులకు రూ.6 వేలు ఎప్పుడు ఇస్తారో చెప్పలేదు.

**– తాటిపాముల వెంకట్రాములు, బీసీ హక్కుల సాధన కమిటీ అధ్యక్షుడు**



జనగామ ఆర్టీసీ చౌరస్తాలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నాయకులు

# ఎన్నో చెప్పారు ఏమిచ్చారు?

## బడ్జెట్‌లో ఓరుగల్లుపై రేవంత్ సర్కారు చిన్నచూపు

**మొన్న కేంద్రం, నిన్న రాష్ట్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఓరుగల్లుకు అన్యాయమే జరిగింది. నిధుల కేటాయింపులో మోదీ సర్కారు యావత్ తెలంగాణపై వివక్ష చూపగా, గురువారం అసెంబ్లీలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్‌లోనూ అదే నిర్లక్ష్యం కనిపించింది. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలతో పాటు ఇటీవలి వరంగల్ పర్యటనలోనూ 'వరంగల్‌పై స్పెషల్ ఫోకస్ పెడతా'ని ఎన్నో మాటలు చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి బడ్జెట్‌లో ఉమ్మడి జిల్లాకు కేటాయింపులు చేయకుండా చిన్నచూపే చూశారు. కీలకమైన కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు, ఇన్నర్, ఔటర్ రింగ్ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణాలపై ప్రస్తావన లేకపోవడంతో పాటు కాళోజీ, కాకతీయ యూనివర్సిటీలకు నిర్వహణ నిధులు తప్ప ప్రత్యేకంగా ఏమీ కేటాయించకపోవడంపై ప్రజల్లో అసంతృప్తి వ్యక్తమవుతున్నది.**

*– వరంగల్, జూలై 25(నమస్తే తెలంగాణ ప్రతినిధి)*

### స్పెషల్ ఫోకస్ అంటూనే పద్దు కేటాయించని వైనం

- ఉమ్మడి జిల్లాకు దక్కని నిధులు
- టెక్స్‌టైల్ పార్కు ప్రస్తావనే లేదు
- వరంగల్ నగర అభివృద్ధికీ నిధుల్లేవు
- అండర్ గ్రౌండ్ డ్రైనేజీపైనా దాటవేత
- యూనివర్సిటీల ప్యాకేజీలో కేయూకు నిధులు
- ఎకో టూరిజం సర్క్యూట్‌లో చోటు
- కిన్నెరసాని, పాకాల, ఏటూరునాగారం సర్క్యూట్

"వరంగల్‌పై ఇక స్పెషల్ ఫోకస్ పెడతా. హైదరాబాద్‌తో పోటీపడేలా నగరాన్ని తీర్చిదిద్దుతా. ఇందుకోసం రూ.6,115 కోట్లు అవసరమని ప్రాథమికంగా అంచనా వేశాం. ఇన్నర్, ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణానికి సత్వరమే భూసేకరణ చేపట్టాలి. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణానికి డీపీఆర్ సిద్ధం చేయాలి. తాగునీటి సరఫరా పైప్‌లైన్ ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందించాలి. 2050 సంవత్సరానికి అనుగుణంగా వరంగల్ మాస్టర్‌ప్లాన్ డిజైన్ చేయాలి."

*- గత నెల 29న వరంగల్ సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి*




కేంద్ర బడ్జెట్ తరహాలోనే రాష్ట్ర బడ్జెట్‌లోనూ వరంగల్ ఉమ్మడి జిల్లాకు తీవ్ర అన్యాయం జరిగింది. రాష్ట్ర బడ్జెట్‌లో వరంగల్ ఉమ్మడి జిల్లాకు ఎలాంటి ప్రత్యేక నిధులు కేటాయించలేదు. అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీల అమలుపైనా బడ్జెట్‌లో ప్రస్తావించలేదు. గత ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలును పట్టించుకోని రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా అమలుచేయాల్సిన వాటికీ నిధులు ఇవ్వలేదు. హైదరాబాద్ తర్వాత పెద్ద నగరంగా ఉన్న వరంగల్ అభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించింది. హైదరాబాద్ మహానగర అభివృద్ధికి బడ్జెట్‌లో రూ.10వేల కోట్లు కేటాయించగా వరంగల్ నగర అభివృద్ధి కోసం ప్రత్యేకంగా నిధులు కేటాయించలేదు. నగరంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీని నిర్మిస్తామని కాంగ్రెస్ ఎన్నికల హామీలో ప్రకటించింది. రాష్ట్ర బడ్జెట్‌లో దీనికి అవసరమైన నిధులను కేటాయించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించింది. సీఎం రేవంత్‌రెడ్డి గత నెల 29న వరంగల్‌లో పర్యటించినప్పుడు సమగ్ర అభివృద్ధి కోసం రూ.6115 కోట్లు అవసరమని ప్రాథమికంగా అంచనా వేసినట్లు తెలిపారు. ఇన్నర్, ఔటర్‌రింగ్ రోడ్డు నిర్మాణాల కోసం అవసరమైన భూసేకరణ ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. స్మార్ట్‌సిటీ మిషన్‌లో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థను అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు(డీపీఆర్) సిద్ధం చేయాలని చెప్పారు. తాగునీటి సరఫరా పైప్‌లైన్ ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. కానీ బడ్జెట్‌లో మాత్రం ప్రత్యేకంగా ఎలాంటి నిధులు కేటాయించలేదు.

**కీలకమైన పనులకు మోక్షం కరువు**

బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన టెక్స్‌టైల్ పార్కు పనులు చివరి దశలో ఉన్నాయి. వస్త్ర పరిశ్రమలు స్థాపించేందుకు అనుగుణంగా టెక్స్‌టైల్ పార్కును త్వరగా పూర్తి చేసేందుకు అవసరమైన నిధులపైనా బడ్జెట్‌లో స్పష్టత ఇవ్వలేదు. టెక్స్‌టైల్ పార్కులో పూర్తి స్థాయిలో వసతులు కల్పిస్తేనే పరిశ్రమలు వచ్చి యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. విద్యారంగంలో కీలకమైన కాళోజీ హెల్త్ యూనివర్సిటీ, కాకతీయ యూనివర్సిటీలకు ప్రత్యేకంగా నిధులు ఇవ్వలేదు. రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీల అభివృద్ధి కోసం రూ.500 కోట్లను మాత్రం బడ్జెట్‌లో పేర్కొన్నారు. ప్రతిపాదనల ఆధారంగా ఆయా వర్సిటీలకు పంపిణీ చేయనున్నారు. రాష్ట్రంలోని ఏకైక వైద్య విద్య విశ్వవిద్యాలయం వరంగల్‌లోనే ఉన్నది. బడ్జెట్‌లో కాళోజీ హెల్త్ యూనివర్సిటీ నిర్వహణ కోసం రూ.2 కోట్లు కేటాయించారు. ఎస్సారెస్పీ వరద కాలువకు రూ.265 కోట్లు, దేవాదులకు రూ.248 కోట్లు, కాళేశ్వరం ప్రాజెక్టుకు రూ.1676 కోట్లు కేటాయించారు. మధ్యతరహా ప్రాజెక్టులలో పాకాలకు రూ.5కోట్లు, రామప్పకు రూ.5కోట్లు, లక్నవరం సరస్సుకు రూ.2కోట్లు కేటాయిస్తున్నట్లు బడ్జెట్‌లో పేర్కొన్నారు. ఎకో టూరిజం ప్రాజెక్టు కింద భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కిన్నెరసానితో పాకాల, ఏటూరునాగారం ప్రాంతాలను అనుసంధానం చేసి అభివృద్ధి చేయనున్నట్లు బడ్జెట్‌లో ప్రభుత్వం ప్రకటించింది.

### ఆదివాసీలకు అన్యాయం



ములుగు రూరల్ : బడ్జెట్ కేటాయింపులో ఆదివాసీలకు తీవ్ర అన్యాయం జరిగింది. గత ప్రభుత్వం అసెంబ్లీ సాక్షిగా తీర్మానం చేసి గిరిజనులకు విద్య, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో 10 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ తీర్మానించింది. దానిని ఈ ప్రభుత్వం తుంగలో తొక్కింది. ఆదివాసీ గిరిజనులు, గిరిజన సంక్షేమ కోసం మొత్తం బడ్జెట్‌లో 10 శాతం ప్రకారం రూ. 29,115 కోట్లు ఇవ్వాల్సి ఉండగా 6 శాతం రిజర్వేషన్‌ను పరిగణలోకి తీసుకొని రూ.17,056 కోట్లు మాత్రమే కేటాయించింది. రూ.12,059 కోట్లకు ఎగ్గొట్టింది. సమీకృత గిరిజనాభివృద్ధి, ఆరోగ్యం, అటవీ హక్కుల చట్టాలను పరిరక్షిస్తామని తన మ్యానిఫెస్టోలో కాంగ్రెస్ హామీ ఇచ్చి ఆదివాసీ ఓట్లను దండుకొని గద్దెనెక్కిన అనంతరం విస్మరించడం దారుణం. ప్రస్తుతం కేటాయించిన బడ్జెట్‌ను నేరుగా ఐటీడీఏ ద్వారా ఖర్చు చేయాలి.

**– వట్టం ఉపేందర్, తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు**

# సముద్రంలోకి జలాలు సర్కారు మల్లగుల్లాలు

*వరద వృథా పోతున్నా స్పందించిన కాంగ్రెస్ ప్రభుత్వం*

- మేడిగడ్డ నుంచి రోజుకు 10 లక్షల క్యూసెక్కుల నీరు దిగువకు
- వినియోగించుకునే అవకాశం ఉన్నా స్పందించని వైనం
- నేడు కేటీఆర్ నేతృత్వంలో బరాజ్‌కు బీఆర్ఎస్ బృందం



**కాలం అనుకూలించక ఇప్పటికే వర్షాలు ఆలస్యంగా మొదలై రైతులు సాగునీటికి ఇబ్బంది పడుతున్నారు. ఈ క్రమంలో కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షానికి తోడు ప్రాణహిత నుంచి మేడిగడ్డకు వరద పోటెత్తి రోజుకు 10 లక్షల క్యూసెక్కుల నీరు సముద్రం పాలవుతున్నా వినియోగించుకునేందుకు కాంగ్రెస్ సర్కారు మల్లగుల్లాలు పడుతున్నది. గోదావరి, మానేరు వాగుల నుంచి నీటి లభ్యత అంతగా లేకపోయినా కేసీఆర్ ముందుచూపుతో ఎక్కువ వరద ఉండే మేడిగడ్డ ప్రాంతంలో బరాజ్ నిర్మించగా ప్రస్తుతం నాలుగు మోటర్ల ద్వారా పంపింగ్ చేసి సాగు, తాగునీరు అందించే ఆస్కారమున్నా పట్టించుకోవడం లేదు. ఈ నేపథ్యంలో నేడు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నేతృత్వంలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల బృందం మేడిగడ్డను సందర్శించి, బరాజ్ అవశ్యకతను, సర్కారు నిర్లక్ష్యాన్ని ప్రజలకు వివరించనున్నది.**

*- జయశంకర్ భూపాలపల్లి, జూలై 25 (నమస్తే తెలంగాణ)*

జయశంకర్ భూపాలపల్లి, జూలై 25 (నమస్తే తెలంగాణ) : గోదావరి, మానేరు వరద అంతగా లేకున్నా ప్రాణహిత పరవళ్లు తొక్కుతున్నది. రోజుకు 10 టీఎంసీల నీరు మేడిగడ్డ (లక్ష్మి) బరాజ్ నుంచి దిగువకు ప్రవహిస్తున్నది. ప్రస్తుతం గోదావరి, మానేరు నుంచి 15వేల క్యూసెక్కుల వరద మాత్రమే అన్నారం (సరస్వతి) బరాజ్ నుంచి మేడిగడ్డకు వస్తున్నది. వృథాగా పోతున్న నీటిని వినియోగించుకునే అవకాశం ఉన్నప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించడం లేదు. ప్రాణహిత నుంచి వరద ఎక్కువగా వచ్చే ప్రదేశాన్ని ముందే గుర్తించిన కేసీఆర్ మేడిగడ్డ వద్ద 16.17 టీఎంసీల సామర్థ్యంతో బరాజ్‌ను నిర్మించినట్లు ఇంజినీర్లు చెపుతున్నారు. మేడిగడ్డలో మొత్తం 85 గేట్లు ఎత్తిపెట్టగా రోజుకు 10 టీఎంసీల నీరు దిగువకు వెళ్తున్నదని, దీని వల్ల బరాజ్ ఆవశ్యకత ఎంతన్నది అవగతమవుతున్నదని వారు పేర్కొంటున్నారు. తమ్మిడిహట్టి వద్ద నీటి లభ్యత అంతగా ఉండదని భావించే మేడిగడ్డ వద్ద బరాజ్ నిర్మించినట్లు చెపుతున్నారు. గతేడాది మేడిగడ్డ బరాజ్‌కు 24 లక్షల క్యూసెక్కుల ప్రాణహిత వరద వచ్చేదని, ప్రస్తుతం 10 లక్షల క్యూసెక్కులు వస్తున్నదన్నారు. ఈ నీటిని కనీసం నాలుగు మోటార్ల ద్వారా పంపింగ్ చేస్తే రైతులు, ప్రజలకు సాగు, తాగు నీటి తిప్పలు తప్పేవని ఇరిగేషన్ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. చేతులు కాలాక ఆకులు పట్టుకున్న చందంగా ప్రభుత్వం నీటి పంపింగ్‌కు అనుమతివ్వాలని ఎన్‌డీఎస్‌ఏ చుట్టూ తిరుగుతున్నదనే విమర్శలున్నాయి. వారం రోజుల్లో ఎన్‌డీఎస్‌ఏ బృందం రానుందని సమాచారం.

**నేడు మేడిగడ్డకు బీఆర్ఎస్ బృందం**

శుక్రవారం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నేతృత్వంలో మాజీ మంత్రి హరీశ్‌రావుతో పాటు ఇతర ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రజాప్రతినిధుల బృందం మేడిగడ్డకు రానుంది. రామగుండం నుంచి బయలుదేరి ఉదయం 10 గంటలకు కన్నెపల్లి పంప్‌హౌస్‌కు చేరుకుంటారు. అక్కడి మోటార్లు పంపింగ్‌కు సిద్ధంగా ఉన్నాయా? గ్రావిటీ కాల్వలు దెబ్బతిన్నాయా? అనేది పరిశీలిస్తారు. మోటార్లు సిద్ధంగా ఉన్నా, పెద్ద మొత్తంలో నీరు వృథాగా పోతున్నా కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు నీటిని పంపింగ్ చేయడం లేదనే విషయాలపై మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు ప్రజలకు క్లారిటీ ఇవ్వనున్నారు. కాంగ్రెస్ అనుసరిస్తున్న వైఖరిని ఎండగట్టనున్నారు. ఆ తర్వాత ఉదయం11 గంటలకు మేడిగడ్డకు చేరుకొని బరాజ్‌ను, వృథాగా పోతున్న ప్రాణహిత నీటిని పరిశీలించి చెన్నూరుకు వెళ్తారు.

## రుణమాఫీ వెతలు

### నా ఆధార్ నంబర్ వేరే రైతుకు నమోదు చేశారు



నర్సింహులపేట, జూలై 25 : నేను డీసీసీ బ్యాంకు నుంచి రూ.45వేల పంట రుణం తీసుకున్న. రుణం తీసుకున్న సమయంలో రూ.5వేలు షేర్ డిపాజిట్ పేరుతో తీసుకొని రూ.35వేలు మాత్రమే ఇచ్చారు. కానీ అధికారుల తప్పిదం వల్ల నా ఆధార్ నంబర్‌ను బదావత్ జాని అనే రైతు పంటరుణం, అతడి ఖాతాకు జాయింట్ చేయడంతో నాకు రుణమాఫీ కాలేదు. కేవలం అధికారుల తప్పిదం వల్లనే రుణం మాఫీ కాలేదు. మూడు రోజుల నుంచి పీఏసీఎస్ కార్యాలయం చుట్టూ తిప్పించుకుంటున్నారు. కార్యాలయంలో పనిచేసే సిబ్బంది నిర్లక్ష్యంగా చూద్దాం.. మా సారు వచ్చిన తర్వాత చేద్దాం అంటూ దాటవేస్తున్నారు. రోజూ ఎందుకొస్తున్నావని వెళ్లగొడుతున్నారు. నా ఆధార్ నంబర్‌ను వేరే రైతు ఖాతాకు జాయింట్ చేసిన అధికారులపై చర్యలు తీసుకుని నాకు న్యాయం చేయాలి.

**–ఎండీ జానీ, రైతు, రామన్నగూడెం**

### వడ్డీ కట్టి రెన్యువల్ చేసుకోమంటున్నరు



నర్సంపేట రూరల్, జూలై25: మాకు లక్నెపల్లి గ్రామ శివారులో ఎకరం వ్యవసాయ భూమి ఉంది. 2020-21 సంవత్సరంలో ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకులో రూ.30 వేల పంట రుణం తీసుకున్న. 2021-22లో రెన్యువల్ చేసుకొని కొంత అదనపు రుణం తీసుకోగా మొత్తం రూ.40 వేలు అయింది. అప్పటి నుంచి ఆర్థిక ఇబ్బందుల వల్ల రెన్యువల్ చేసుకోలే. ప్రస్తుతం వడ్డీ, అసలు కలిపి రూ.52వేలు చూపిస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన లక్షలోపు రుణ మాఫీలో మొదటి సారి తీసుకున్నది మాఫీ అవుతుందనుకున్న. కానీ లిస్టులో నా పేరు లేదు. ఈ విషయమై బ్యాంక్ అధికారులను కలిస్తే ప్రస్తుతం వడ్డీ కట్టి రెన్యువల్ చేసుకోమంటున్నరు. మళ్ల రుణ మాఫీ కోసం ప్రభుత్వానికి పంపుతామంటున్నరు. ఉన్నతాధికారులు స్పందించి క్రాప్ లోన్‌ను మాఫీ చేయాలి.

**– దామెరశెట్టి శైలజ, రైతు, లక్నెపల్లి, నర్సంపేట**

# ఏసీబీకి చిక్కిన సబ్ రిజిస్ట్రార్

- గిఫ్ట్ రిజిస్ట్రేషన్ చేసేందుకు రూ. 80 వేలు డిమాండ్
- పరకాలలో ప్రైవేట్ డాక్యుమెంట్ రైటర్ ద్వారా డబ్బు లు తీసుకోగా పట్టివేత



పరకాల సబ్ రిజిస్ట్రార్ సునీత, డాక్యుమెంట్ రైటర్ నరేశ్

పరకాల, జూలై 25: పరకాల సబ్ రిజిస్ట్రార్ ఏసీబీ వలకు చిక్కారు. వారసత్వంగా వస్తున్న భూమిని రిజిస్ట్రేషన్ చేసేందుకు రూ. 80 వేలు లంచం డిమాండ్ చేయడంతో బాధితులు అవినీతి నిరోధక శాఖ అధికారులను ఆశ్రయించారు. వివరాలిలా ఉన్నాయి. పరకాల మున్సిపాలిటీ విలీన గ్రామమైన సీతారాంపురం గ్రామానికి చెందిన అన్నదమ్ములు లడే శ్రీనివాస్, శ్రీకాంత్‌లు తమ తల్లిదండ్రుల పేరుతో ఉన్న 481/సీలో నాలుగు గుంటల భూమిని తమ పేరుపైన రెండు సమ భాగాలుగా గిఫ్ట్ రిజిస్ట్రేషన్ చేసేందుకు ప్రైవేట్ డాక్యుమెంట్ రైటర్ బొట్ల నరేశ్‌ను సంప్రదించారు. ఈ విషయాన్ని నరేశ్ సబ్ రిజిస్ట్రార్ సునీత దృష్టికి తీసుకెళ్లగా రిజిస్ట్రేషన్ చేసేందుకు రూ. 80వేలు డిమాండ్ చేసినట్లు చెప్పాడు. దీంతో బాధితులు ఏసీబీని ఆశ్రయించారు. అవినీతి నిరోధక శాఖ అధికారులు చెప్పిన ప్రకారం బాధితులు గురువారం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి చేరుకుని నరేశ్‌కు రూ.80 వేల నగదు ఇచ్చారు. డబ్బులు ముట్టాయని అతను చెప్పడంతో సబ్ రిజిస్ట్రార్ రిజిస్ట్రేషన్ చేసేందుకు రెడీ అయ్యారు. ఈ క్రమంలో ఏసీబీ డీఎస్పీ సాంబయ్య ఆధ్వర్యంలో ఇన్‌స్పెక్టర్లు శ్యాం, రాజు అక్కడే కాపుకాసి ఉన్న అధికారులు నరేశ్ నుంచి డబ్బులను స్వాధీనం చేసుకున్నారు.రెండు గంటలపాటు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో తనిఖీలు, విచారణ చేపట్టి సబ్ రిజిస్ట్రార్ సునీత, ప్రైవేట్ డాక్యుమెంట్ రైటర్ నరేశ్‌ను అదుపులోకి తీసుకున్నారు.

**అన్ని పత్రాలు ఉన్నాయన్నా డబ్బులు డిమాండ్ చేసిన్రు**

వారసత్వంగా వస్తున్న భూమిని రిజిస్ట్రేషన్ చేసేందుకు డబ్బులు డిమాండ్ చేసిన్రు. అన్ని పత్రాలు సరిగా ఉన్నాయని చెప్పినం. అయినా కుడా డబ్బులు ఇస్తేనే రిజిస్ట్రేషన్ అవుతుందని చెప్పిన్రు. రెండు సమభాగాలుగా రిజిస్ట్రేషన్ చేయాలంటే రూ.80వేలు అవుతయ్. అవి ఇస్తేనే రిజిస్ట్రేషన్ చేస్తామని చెప్పడంతో ఏసీబీ అధికారులను కలిశాం. ఈ నెల మొదటి వారంలో స్లాట్ బుక్ చేసుకున్నాం. **– లడే శ్రీనివాస్, బాధితుడు, సీతారాంపురం**

### భర్త మరణం తట్టుకోలేక భార్య మృతి



సత్తి ముత్తయ్య,యశోదమ్మ (ఫైల్)

డోర్నకల్, జూలై 25: భర్త మరణం తట్టుకోలేక భార్య గుండెపోటుతో మృతి చెందిన ఘటన మండలంలోని ముల్కలపల్లి గ్రామంలో గురువారం జరిగింది. కుటుంబసభ్యుల కథనం ప్రకారం.. సత్తి ముత్తయ్య(80) కొద్ది కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ బుధవారం రాత్రి మృతి చెందాడు. గురువారం ఉదయం అంత్యక్రియలు చేయడానికి కుటుంబ సభ్యులు సిద్ధమవుతుండగా ముత్తయ్య భార్య యశోదమ్మ(70) మృతదేహం వద్ద రోదిస్తూ గుండెపోటుతో కుప్పకూలిపోయింది. వెంటనే ఖమ్మం దవాఖానకు తరలించగా అప్పటికే మృతి చెందింది. దీంతో గ్రామంలో విషాదం నెలకొంది. వీరికి ముగ్గురు కుమారులు, కుమార్తె ఉన్నారు. వృద్ధ దంపతులకు ఒకేసారి అంత్యక్రియలు నిర్వహించారు.